క్లుప్తంగా

ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించిందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని చెప్పారు. ప్రజల సంక్షేమం విస్మరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని ఆరోపించారు.

రైతులకు విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ రైతులకు విత్తనాలు అందించారు. విత్తనాలు పొందిన రైతులు వేరుశనగ పంటను సాగుచేసి వ్యవసాయశాఖకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ కో–ఆర్డినేటర్ హరిమోహన్‌రెడ్డి, ఏఈఓలు గాయత్రి, భూదేవి, నిఖిత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కిషన్ రెడ్డి

మాడ్గుల: ఆలయాలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. మండలంలోని కాట్రమ్ తండాలో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని ఆలయానికి మంగళవారం ఆయన రూ.50 వేలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆలయాలతో సోదరభావం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొండల్ రెడ్డి, సాయిరెడ్డి, జంగయ్య, సంధ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో పని చేస్తున్న 140 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆయన తన సొంత ఖర్చులతో దసరా కానుకగా ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెల్లవారింది మొదలు రాత్రివరకు కార్మికులు పట్టణాన్ని శుభ్రం చేయడంలో నిమగ్నం అవుతున్నారన్నారు. వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం వంటి ఎన్నో పనులను వారు నిర్వహిస్తున్నారన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది చేసిన సేవలు ఎనలేనివన్నారు. అలాంటి కార్మికులకు అందరూ అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, జమ్రుద్‌ఖాన్, బస్వం, సర్వర్‌పాషా, ఇబ్రహీం, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

చేవెళ్ల యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిరంజన్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల పరిశుభ్రతకు కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని చేవెళ్ల యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిరంజన్‌గౌడ్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో పంచాయతీ కార్మికులకు ఆయన సొంత డబ్బులతో కార్మికులందరికీ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుత్తి బాలరాజ్, కుమ్మరి సురేష్, నర్సింహ, వెంకటేశ్, కుమార్, రాజు, శ్రీశైలం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతాఫలం.. దిగుబడి ఘనం

- కడ్తాల్‌లో జోరుగా విక్రయాలు
- సేకరణలో నిమగ్నమైన స్థానికులు
- ఉపాధి పొందుతున్న రైతులు, వ్యాపారులు



జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు

కడ్తాల్: పేదోడి ఆపిల్ అయిన సీతాఫలాలకు కడ్తాల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలు పెట్టింది పేరు. చల్లంపల్లి, మక్తమాదారం, రావిచేడ్, టాక్‌రాజ్‌గూడ, వంపూగూడ, మైసిగండి, కర్కల్‌పహడ్, అన్మాస్‌పల్లిలతో పాటు సుమారు 20 తండాల గిరిజనులతో పాటు, పలువురు రైతులు ఈ సీజన్‌లో సీతాఫలాల సేకరణలో నిమగ్నం అవుతారు. ఈసారి వర్షాలు జోరుగా కురవడంతో సీతాఫలాల సేకరణ, విక్రయాలు జోరందుకున్నాయి. గత ఐదేళ్లుగా సీతాఫలాల దిగుబడి బాగానే ఉంది. మండలం నుంచి హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిలో కడ్తాల్–కల్వకుర్తి వరకు, ప్రతి గ్రామం ప్రధాన రోడ్డుపై సీతాఫలాలు విక్రయిస్తూ వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ప్రస్తుతం వ్యాపారం లాభసాటిగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పెరిగిన ఉత్పత్తులు

ఏటా సెప్టెంబర్ మొదటి వారం నుంచి సీతాఫలాల సేకరణ ప్రారంభమై, అక్టోబర్, నవంబర్ మాసాల వరకు జోరుగా సాగుతాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురియడంతో దిగుబడి గణనీయంగా పెరిగింది. ఇక్కడి నుంచి నిత్యం వాహనాల్లో సీతాఫలాలను హైదరాబాద్‌కు తరలించి ఉపాధి పొందుతున్నారు. సీతాఫలాల నాణ్యత బాగా ఉండటంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది బుట్ట రూ.200 నుంచి రూ.300 పలుకగా ఈసారి ఉత్పత్తులు పెరగడంతో ధరలో ఏ వ్యత్యాసం లేదు. సుమారు 80 నుంచి 90 కాయలు పట్టే ఒక్కో ప్లాస్టిక్ బుట్ట రూ.400 నుంచి రూ.700 వరకు పలుకుతుంది. రైతు వద్ద మాత్రం ఒక్కో సీతాఫలం రూ.5 నుంచి రూ.7 పలుకగా, వ్యాపారులు కాయ పరిమాణం బట్టి రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. సీతాఫలాలలో పోషక పదార్థాలు అధికంగా ఉండటంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

వ్యాపారం పర్వాలేదు



నాలుగైదు ఏళ్లుగా వర్షాలు లేక వ్యాపారం అంతగా లేదు. ఈసారి వానలు కురవడంతో కాయల సైజుతో పాటు నాణ్యత బాగుంది. కొనుగోలుదారులు ఇష్ట పడి ధర ఎంతైన పెట్టి కొంటున్నారు. ఇప్పటికై తే సీతాఫలాల వ్యాపారం పర్వాలేదు. విక్రయాల ద్వారా ఉపాధి లభిస్తోంది.

– దీపక్, వ్యాపారి, కడ్తాల్

ఉపాధి పొందుతున్నాం



మండల కేంద్రంలో టోల్ ప్లాజా వద్ద పండ్ల వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నాను. సీజన్‌లో ఆయా పండ్లను విక్రయించి ఉపాధి పొందుతాం. ఈసారి సీతాఫలాల విక్రయాలు బాగానే సాగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి కాయలు బాగా కాశాయి. విక్రయాలు పెరిగాయి.

– కేశవనాయక్, వ్యాపారి, పుట్టపర్తి(ఏపీ)

బాగా కాశాయి



ఈసారి సీతాఫలాలు బాగా కాశాయి. మా పొలంలో ఇరవై వరకు చెట్లు ఉన్నాయి. రెండు, మూడు రోజులకు నాలుగైదు బాక్స్‌లు వరకు దిగుబడి వస్తోంది. వాటిని కడ్తాల్‌లో విక్రయిస్తున్నాను. రూ.2 వేల వరకు ఆదాయం పొందుతున్నాను. కాయల సైజ్ బాగా పెరిగాయి.

– గోపాల్, రైతు, ముచ్చర్ల, కందుకూరు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి గ్రామాల్లో నాయకులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. విజయం కోసం కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను సమాయత్తం చేయాలని సూచించారు. మంచాల మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ పోటీ చేస్తుందని ప్రకటించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఒంటరిగానే బరిలో ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, నాయకులు బాషయ్య, నర్సింహారెడ్డి, శ్రీశైలం, హరీష్, జనార్దన్‌రెడ్డి, పాండు, రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని వారి పేర్లు తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

హయత్‌నగర్: భూమి లేకుండా హయత్‌నగర్ రైతు సేవా సహకార సంఘంలో కొనసాగుతున్న వారి పేర్లను తొలగించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆవరణలో సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. భూములు అమ్ముకున్నవారు సైతం రైతులుగా సంఘంలో చెలామణి అవుతున్నారని పలువురు రైతులు సమావేశంలో లేవనెత్తారు. అధ్యక్షుడు కృష్ణారెడ్డి బదులిస్తూ.. భూమి లేని వారి పేర్లను తొలగిస్తామని, వారు సంఘానికి బకాయిలు ఉంటే వసూలు చేస్తామని తెలిపారు. ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్) పథకం కింద సంఘం ఎంపికైందని, ప్రతి సభ్యుడు తమ వాటా కింద రూ.2,000 చెల్లించాలని కోరారు. సీఈఓ మల్లికార్జున్ సంఘం జమా ఖర్చులను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఢిల్లీ విజయలక్ష్మి, డైరెక్టర్లు రాజశేఖర్, నర్సింహారెడ్డి, అంజయ్య, జగన్మోహన్‌రెడ్డి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు బహిష్కరిస్తాం



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బండలేమూర్ గ్రామస్తులు

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్ణయించిన వార్డు రిజర్వేషన్లలో(ఎస్సీ) దళితులకు స్థానం కల్పించలేదని బండలేమూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కార్యాలయంలో సూపరింటెండెంట్ అజీమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండలేమూర్ గ్రామంలో పది వార్డులు ఉన్నాయన్నారు. వాటిలో 5 ఎస్టీలకు, 3 బీసీలకు, 2 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఎంపీటీసీ ఎస్టీ, సర్పంచ్ స్థానం కూడా ఎస్టీకే కేటాయించి దళితులకు ప్రాతినిధ్యం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలకు అన్యాయం చేస్తే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కృష్ణ, లింగస్వామి, మహేష్, దిలీప్, ప్రవీణ్, శివ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

షాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ సెక్రటరీ సాయిబాబా, ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ కోచ్ దామోదర్ రావు ఆ ఫౌండేషన్ హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ వారి సౌజన్యంతో బాస్కెట్ బాల్ పోల్, వాలీబాల్ పోల్, ఖోఖో పోల్స్ పలు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి తదితరులు

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: పట్టణంలో దసరా సంబరాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గుర్రం కేశవులు, కండె హరిప్రసాద్, వస్పుల మానయ్యలు కోరారు. బతుకమ్మ పండుగ కోసం ఆమనగల్లు హనుమాన్ దేవాలయం, గాంధీచౌక్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలు విజయవంతం చేయడానికి ఈ ఏడాది పాలకవర్గం లేకపోవడంతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో పెద్ద ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. బతుకమ్మల నిమజ్జనం కోసం చెరువు వద్ద ఘాట్ ఏర్పాటు చేశామన్నారు. దసరా రోజు రచ్చకట్ట వద్ద నుంచి కాలేజీ గ్రౌండ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ఆ తరువాత కాలేజీ గ్రౌండ్స్‌లో రావణదహనం ఉంటుందని చెప్పారు. దసరా సంబరాలు విజయవంతం చేయడానికి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు దుర్గయ్య, నర్సింహ, చెన్నకేశవులు, సాయిలు, భాస్కర్, మహేశ్, ప్రశాంత్, సిరి, ప్రవీణ్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నది

చేవెళ్ల: పోలీస్ ఉద్యోగంలో ఎంతో ఒత్తిడి ఉంటుందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఏ.బాలాజీ అన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.శంకరయ్య పదవీ విరమణ పొందగా తోటి ఉద్యోగులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అంటేనే ఒత్తిడితో ఎన్నో ఇబ్బందులతో సాగే ఉద్యోగమన్నారు. కుటుంబానికి సమయం కేటాయించటం కూడా కష్టంగా ఉంటుందన్నారు. ఇలాంటి ఉద్యోగంలోఎలాంటి రిమార్కులు లేకుండా పదవీ విరమణ పొందటం అంటేనే ఎంతో గొప్ప విషయమని కొనియాడారు.

గ్రూప్–1 ఉద్యోగికి సన్మానం



ఫణిరాజ్‌ను సన్మానిస్తున్న ఓయూ జేఏసీ గిరిజన నాయకులు

మాడ్గుల: మండల పరిధిలోని జయరాంతండాకు చెందిన వడ్త్య ఫణిరాజ్ గ్రూప్–1 నియామకాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ గిరిజన శక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బునాయక్ మంగళవారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత ఫణి రాజ్‌ను ఆదర్శంగా తీసుకొని చదువుపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. గ్రూప్–1 నియామకాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు తారసింగ్, సుదర్శన్, ఉపేందర్, హనుమాన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ ఉద్యోగులు

ఆమనగల్లు: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ మూడవత్ శంకర్ నాయక్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, సిబ్బంది ఉపేందర్‌రెడ్డి, రమేశ్‌నాయక్, శ్రవణ్, రామకృష్ణ, పర్వతాలు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. మహిళలతో పాటు బతుకమ్మ వేడుకలో ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ.. నమోస్తుతే



ఇబ్రహీంపట్నం: దుర్గాదేవి అలంకరణ



తుర్కయంజాల్..



ఆమనగల్లులో..

దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఊరూరా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో జగన్మాత వివిధ రూపాల్లో పూజలందుకున్నారు. మండపాల వద్ద అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.



పెద్ద అంబర్‌పేటలోని వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం: అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



తుర్కయంజాల్: మన్నెగూడలోని ఎస్‌ఎస్‌ఆర్‌నగర్‌లో దుర్గామాత మండపం వద్ద..



కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమనగల్లు: దుర్గాదేవి పూజలో ఎస్ఐ వెంకటేశ్, భక్తులు



ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న భక్తులు